సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



అగమ్యగోచరంగా విద్యా రంగం 8లో



టైబ్రేకర్‌లో ముంబాదే గెలుపు 8లో



వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సంపత్ వినాయగర్ స్వామి శనివారం మయూరేశ గణపతి అలంకారంలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా సర్వ సభ్య సమావేశం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా సర్వ సభ్య సమావేశం ఆదివారం ఉదయం 9.30 గంటలకు జరగనుంది. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబుతో పాటు సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మేయర్, ముఖ్యనాయకులు హాజరవుతారు. సమావేశానికి జిల్లా ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, వార్డు అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు హాజరుకావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖ లీగల్: వచ్చే నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణ నుంచి వర్చువల్‌గా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అన్ని న్యాయస్థానాల జ్యుడిషియల్ అధికారులు పాల్గొన్నారు.

వీబీసీఏ అధ్యక్షుడిగా రోలండ్ విలియమ్స్



రోలండ్ విలియమ్స్

ఏయూక్యాంపస్: విశాఖపట్నం కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్(వీబీసీఏ) అధ్యక్షుడిగా మెరిలిన్ షిప్పింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రోలండ్ విలియమ్స్ ఎన్నికయ్యారు. 2025–27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని శనివారం అసోసియేషన్ ఎన్నుకుంది. సంస్థ కార్యదర్శిగా శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జి.శ్రావణ్ కుమార్ ఎన్నికయ్యారు. 1974లో ప్రారంభమైన వీబీసీఏ ఫెడరేషన్ ఆఫ్ ఫ్రైట్ ఫార్వర్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎఫ్ఎఫ్ఏఐ), ఏపీ చాంబర్స్‌లో క్రియాశీలకంగా నిలుస్తోంది.

అక్టోబర్ 15న ఏయూ స్నాతకోత్సవం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92వ సంయుక్త స్నాతకోత్సవం అక్టోబర్ 15వ తేదీ జరగనుంది. కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవరంగం వేదికగా జరగనున్న స్నాతకోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు రిజిస్ట్రార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు.

యాచకులను వారి కుటుంబాలకు అప్పగించాలి



యాచకుల ఆధార్ వివరాలను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగరంలో గుర్తించిన యాచకులను వారి కుటుంబాల చెంతకు చేర్చేందుకు పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా నగరంలో భిక్షాటన చేస్తున్న 243 యాచకులను పోలీసులు ఇప్పటికే రెస్క్యూ చేసి వారిని పలు ఆశ్రమాల్లో ఆశ్రయం కల్పించారు. వీరిలో 115 మందిని వారి కుటుంబాలకు అప్పగించారు. మిగిలిన 128 మంది యాచకులను వారి వివరాలను తెలుసుకునేందుకు ఏయూటీడీ డే-నైట్ హోంలెస్ షెల్టర్ ఆధ్వర్యంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యాచకులకు ఆధార్ ఉన్నదీ, లేనిదీ, వారి వేలిముద్రల ఆధారంగా పరిశీలించారు. కార్యక్రమాన్ని సీపీ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షించారు. వివరాల ప్రకారం యాచకులను వారి కుటుంబాలకు చేర్చాలని పోలీసులను సీపీ ఆదేశించారు.

కూటమి టెండరింగ్

డిపాజిట్ ధరలు భారీగా తగ్గించి తీసుకునేందుకు కూటమి నేతల కొత్త ఎత్తుగడ

సగానికి పైగా బార్లకు దరఖాస్తులు పడకుండా తెరవెనుక వ్యూహాలు

- జిల్లాలో 131 బార్లకు గాను 67 బార్లకే దరఖాస్తుల రాక
- అది కూడా ఒక్కో బార్‌కు ఒక్కరే నాలుగేసి దరఖాస్తులు
- లాటరీ తీసిన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- ఓపెన్‌లో 57, గీత కులాలకు 10 బార్లు కేటాయింపు



విశాఖ సిటీ: జిల్లాలో బార్ల కేటాయింపులో కూటమి నేతల టెండ'రింగ్' బట్టబయలైంది. బార్ల డిపాజిట్ ధరలు భారీగా తగ్గించి వాటిని సొంతం చేసుకునే ఎత్తుగడ స్పష్టంగా కనిపించింది. కొత్త బార్లకు దరఖాస్తులు రాకుండా తెరవెనుక నడిపిన తతంగం బహిర్గతమైంది. జిల్లాలో కొత్త బార్లకు ఎవరూ ముందుకు రాకుండా కూటమి రింగ్ మాస్టర్ల బ్లాక్‌మెయిలింగ్ వ్యవహారం చర్చనీయాంశమవుతోంది. జీవీఎంసీ పరిధిలో ఓపెన్ కేటగిరీలో 121 బార్లకు కేవలం 57 బార్లకు మాత్రమే దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనం. వీటికి శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చేతుల మీదుగా లాటరీ తీసి బార్లను కేటాయించారు. మిగిలిన 64 బార్లను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భారీగా డిపాజిట్ ధరలు తగ్గించి చేజిక్కించుకోవాలని కూటమి నేతలు ఎత్తులు వేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

నగం బార్లకు కూడా జరగని లాటరీ

జీవీఎంసీ పరిధిలో ఓపెన్ కేటగిరీలో 121, కల్లు గీత కులాలకు 10 బార్లు మొత్తంగా 131 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. గతేడాది వైన్‌షాపులను చేజిక్కించుకున్నట్లుగానే ఈ బార్లను కూడా సొంతం చేసుకోవాలని కూటమి నేతలు పక్కా ప్లాన్ వేశారు. అయితే బార్ లైసెన్సు కోసం 50 వేలు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, రూ.5 లక్షలు దాటితే రూ.75 లక్షలు చెల్లించాల్సి ఉంది. లైసెన్సు ఫీజు భారీగా ఉండడంతో దాన్ని తగ్గించే ఎత్తుగడ వేశారు. తొలి దశలో నిర్వహించే లాటరీకి దరఖాస్తులు రాని పక్షంలో తర్వాత ఆ లైసెన్స్ ఫీజులు భారీగా తగ్గించి తద్వారా బార్లను సొంతం చేసుకోవాలని ఆలోచనకు వచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే కూటమిలో ఒక గ్యాంగ్ ఆ బాధ్యతను తీసుకుని బార్లకు ఎక్కువగా దరఖాస్తులు రాకుండా తెరవెనుక కథ నడిపినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. పైకి వైన్‌షాపులు కారణంగానే బార్ల నిర్వహణకు ఎవరూ ముందుకు రావడం లేదన్న ప్రచారాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ నెపంతో లైసెన్స్ ఫీజు భారీగా తగ్గించిన తర్వాత బార్లను చేజిక్కించుకునే కుట్రకు తెరతీశారన్న టాక్ వినిపిస్తోంది. ఫలితంగా జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 121కి, గీత కులాలకు చెందిన 10 బార్లకు కేవలం 263 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దీని ప్రకారం ఓపెన్‌లో 57 బార్లకు దరఖాస్తులు చేశారు.

ఒక్కరే నాలుగేసి..

ఓపెన్ కేటగిరీలో కూడా బార్లకు ఒక్కరే నాలుగేసి దరఖాస్తులు చేయడం గమనార్హం. వీరిలో అధిక సంఖ్యలో కూటమికి చెందిన వారే ఉండడం విశేషం. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీసే అవకాశముంది. దీంతో బయట వారు ఎవరూ దరఖాస్తులు చేయకుండా కేవలం కూటమికి చెందిన వారే ఒక్కొక్కరు నాలుగేసి దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ఒక్కొక్కరు నాలుగు దరఖాస్తులకు అప్లికేషన్ ఫీజుతో కలిపి రూ.20.40 లక్షలు చెల్లించారు. ఫలితంగా లాటరీ ప్రక్రియ నామమాత్రంగా మారిపోయింది. నిబంధనల ప్రకారం లాటరీ తీసినప్పటికీ.. ఒక్కో బార్‌కు ఒక్కరే ఉండడంతో పోటీ లేకుండా పోయింది. వారికే ఆ బార్ దక్కింది. కల్లు గీత కులాలకు కేటాయించిన 10 బార్లకు ఇదే తరహాలో దరఖాస్తులు రాగా వాటికి కూడా లాటరీ తీసి కేటాయించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు

నూతన బార్ పాలసీకి అనుగుణంగా లాటరీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మీడియాకు చెప్పారు. జీవీఎంసీ పరిధిలో రిజర్వ్‌లో పది, ఓపెన్ కేటగిరీలో 121 కలిపి మొత్తం 131 బార్లు ఉండగా ఆశావహుల నుంచి 263 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిలో గీత కులాలకు పది, ఓపెన్ కేటగిరీలో 57 కలిసి మొత్తం 67 బార్లకు లాటరీ ప్రక్రియ ముగిసిందన్నారు. సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామని, దరఖాస్తులు రాక మిగిలిపోయిన బార్ల విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

గీతం గుప్పిట్లో ఏయూ?

- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'గీతం' పెత్తనం!
- ప్రైవేట్ వర్సిటీపై వీసీ అవాజ్య ప్రేమ
- సీనియర్లని కాదని రిజిస్ట్రార్‌గా రాంబాబు నియామకం
- గతంలో గీతంలో కలిసి పని చేసిన రాంబాబు
- అప్పుడు వీసీ, ఇప్పుడు రిజిస్ట్రార్ పేరును సిఫార్సు చేసిన ఎంపీ భరత్



సాక్షి, విశాఖపట్నం: చారిత్రాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంపై 'గీతం' పెత్తనం పెరుగుతోందా? విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాల్సిన వర్సిటీని కూటమి ప్రభుత్వం రాజకీయ క్రీడకు వేదికగా మారుస్తోందా? ప్రస్తుత పరిణామాలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా పక్కనే ఉన్న ప్రైవేట్ వర్సిటీ కోసం ఏయూ ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించిన టీడీపీ.. ఇప్పుడు మళ్లీ అదే బాటలో పయనిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గీతంలో పనిచేసిన వ్యక్తిని వైస్ చాన్సలర్‌గా నియమించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ తాను ముక్కనే రిజిస్ట్రార్‌గా నియమించడం వివాదాస్పదమవుతోంది. ఏయూలో ఎంతోమంది సీనియర్లు ఉండగా, వారిని కాదని గీతం వర్సిటీతో సంబంధమున్న వ్యక్తిపై అవాజ్య ప్రేమ చూపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీసీ నియామకం లాగే.. ప్రస్తుత రిజిస్ట్రార్ నియామకం వెనుక ఎంపీ భరత్ సిఫార్సు ఉందన్నది బహిరంగ రహస్యం.

అస్తవ్యస్తంగా ఏయూ పాలన

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అస్తవ్యస్త పాలన కొనసాగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీని రాజకీయానికి బలి చేస్తున్నారు. గతంలో పనిచేసిన వీసీ, రిజిస్ట్రార్‌లపై బెదిరింపులకు పాల్పడి.. బలవంతపు రాజీనామాలు చేయించిన కూటమి నేతలు.. తమ వారిని ఆ కుర్చీల్లో కూర్చోబెట్టారు. ముఖ్యంగా గీతం యూనివర్సిటీ చైర్మన్, ఎంపీ భరత్ కనుసన్నల్లోనే కీలక పదవుల నియామకాలు జరుగుతుండటం చూస్తుంటే.. విశ్వ విద్యాలయం ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని ఏయూ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విద్యాబోధన, ఇతర ఏయూ అభివృద్ధిని పక్కనపెట్టేసి.. కుర్చీలాటలాడుకోవడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. నాలుగు రోజుల కిందట ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. తమ వ్యక్తిని ఆ పదవిలో నియమించుకోవడం కోసం వీసీ రాజశేఖర్.. ఆయనపై పొమ్మనలేక పొగపెట్టినట్లు తెలుస్తోంది. వీసీ వైఖరి నచ్చకపోవడం, పదవీకాలం ముగియనుండటంతో త్వరగా వైదొలగాలని కూటమి నేతల నుంచి వచ్చిన ఒత్తిడులను తట్టుకోలేకే ధనుంజయరావు రాజీనామా చేశారని సమాచారం. ఆ వెంటనే, ఎంపీ భరత్ మరోసారి చక్రం తిప్పి, గీతం వర్సిటీతో సంబంధం ఉన్న వ్యక్తిని ఆ కుర్చీలో కూర్చోబెట్టేశారు.

వీసీ, రిజిస్ట్రార్.. ఇద్దరూ 'గీతం' వారే!

గత వీసీని బలవంతంగా రాజీనామా చేయించిన తర్వాత కూటమి నేతలు ఏయూను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. ముఖ్యంగా ఎంపీ భరత్ ఏయూపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే, గతంలో గీతంలో పనిచేసి, ఆ తర్వాత ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విధులు నిర్వర్తించిన రాజశేఖర్‌ను ఏయూ వైస్ చాన్సలర్‌గా నియమించాలని పట్టుబట్టి మరీ పదవి కట్టబెట్టారు. ఇప్పుడు రిజిస్ట్రార్‌ను అర్ధాంతరంగా తొలగించడం వెనుక కూడా భరత్ కుట్ర ఉందన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న రాంబాబు గతంలో గీతంలోనూ విధులు నిర్వర్తించారు. రాంబాబును రిజిస్ట్రార్‌గా నియమించాలని భరత్ సిఫార్సు చేయడంతో, వీసీ ఆయన పేరును ఉన్నత విద్యామండలికి పంపించారు. ఆ తర్వాత ఎంపీ ప్రభుత్వ స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి రాంబాబు నియామకానికి ఆమోదముద్ర వేయించారు. రాంబాబు కంటే ఎంతోమంది సీనియర్లు వర్సిటీలో ఉన్నా, వారందరినీ పక్కనపెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీసీ పూర్తిగా రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ విశ్వవిద్యాలయ ప్రతిష్టను మంటగలుపుతున్నారని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వర్సిటీ మూలాలు ఏయూలో విస్తరించడం భవిష్యత్తులో విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం కలిగించవచ్చని ఆందోళన సర్వత్రా నెలకొంది.

స్థానిక నేతలది ప్రేక్షకపాత్రే

- కార్పొరేటర్లు ఓ మూలకే పరిమితం
- 12 వేల అంచనా.. 3 వేలే హాజరు!



పవన్ ప్రసంగిస్తుండగా ప్రాంగణం వెలవెల..

జగదాంబ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్వహించిన 'సేనతో సేనాని' కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయింది. భారీ అంచనాల మధ్య జరిగిన ఈ సభకు జనం ముఖం చాటేశారు. సభలో స్థానిక నాయకులను పూర్తిగా విస్మరించడం, పోలీసుల మితిమీరిన ఆంక్షలతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

స్థానిక నేతలకు దక్కని ప్రాధాన్యం

ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన సేనతో సేనాని కార్యక్రమం అంచనాలను అందుకోవడంలో విఫలమైంది. సభలో స్థానిక నాయకులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. దక్షిణ నియోజకవర్గం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లితో పాటు రాష్ట్రంలోని జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం అవుతుందనుకున్న సభ.. ఆరు గంటల వరకు ప్రారంభం కాలేదు. పార్టీ అధ్యక్షుడు వచ్చిన తర్వాత సభాధ్యక్ష బాధ్యతలు తీసుకున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ మినహా మిగతా వారంతా ప్రేక్షక పాత్ర వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా ఏ ఒక్క స్థానిక నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ముందుగా సిద్ధం చేసుకున్న స్క్రిప్ట్ ప్రకారం ఇతర జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలతో పొగడ్తలు గుప్పించడంతో స్థానిక నేతలు తెల్లముఖాలు వేశారు. మరో వైపు జనసేన కార్పొరేటర్లను, పార్టీ మారిన వారిని సభా ప్రాంగణంలో ఓ మూలకు కూర్చోబెట్టడం వారిని మరింత ఇబ్బందికి గురిచేసింది. కనీసం నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.. కార్యకర్తను నాయకుడిని చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానించారు.

ముఖం చాటేసిన జనం

సభకు 12 వేలకు మందికి పైగా జనం వస్తారని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితర నాయకులు మూడు రోజులుగా విస్తృత ప్రచారం చేశారు. అయితే, వారి అంచనాలు తలకిందులయ్యాయి. అనుకున్నంతగా జనం రాలేదు. దీంతో సభా ప్రాంగణం వెలవెలబోయింది. కేవలం 3 వేల మంది సైనికులు, అభిమానులు మాత్రమే హాజరైనట్లు అంచనా. భారీగా వేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడంతో పార్టీ శ్రేణుల్లోనే తీవ్ర నిరాశ నెలకొంది.

పోలీసుల ఆంక్షల హంగామా

సేనతో సేనాని కార్యక్రమం కోసం పోలీసులు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం స్టేడియం పరిసరాల్లో మోహరించింది. రామకృష్ణ జంక్షన్, రైతుబజార్, టౌన్‌కొత్తరోడ్డు, దుర్గాలమ్మ జంక్షన్, వెలంపేట వంటి కీలక ప్రాంతాల్లో బారికేడ్లు పెట్టి రహదారులను మూసేశారు. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు చేసిన అత్యుత్సాహం తోటి పోలీసులకే విసుగు తెప్పించింది.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేశారట!

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా జనసేన ఆపిందని చెప్పిన పవన్ కల్యాణ్.. ప్రస్తుతం చాపకిందనీరులా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కార్యక్రమాలు జరుగుతున్నా సభలో నోరెత్తకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక సభా కార్యక్రమం మధ్యలో తమిళ నటుడు విజయ్ పెట్టిన పార్టీ జెండాలను పవన్ కల్యాణ్ వేసుకోవడంతోపాటు అక్కడ నుంచి వచ్చిన కార్యకర్తలతో ఆ జెండాలను ఆవిష్కరించారు.

కష్టజీవుల పస్తు!

- సేనాని సభ కోసం పేదల పొట్టపై దెబ్బ
- పోలీసుల బెదిరింపులతో దుకాణాల బంద్
- రోజు కూలి పోయిందని కార్మికుల ఆవేదన



పోలీసుల ఆంక్షలతో మూసివేసిన దుకాణాలు



దుకాణాలు మూసివేయిస్తున్న పోలీసులు

అల్లిపురం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 'సేనతో సేనాని' పేరిట నిర్వహించిన సభ.. ఆ ప్రాంతంలోని కష్టజీవులకు కన్నీటిని మిగిల్చింది. పవన్ రాక సందర్భంగా పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం, తీసుకున్న కఠిన చర్యలు.. రోజు కూలి వస్తే గానీ పూట గడవని వందలాది కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. ఈ కార్యక్రమం 'ఒకరికి మోదం.. మరొకరికి ఖేదం' అన్న చందంగా సాగింది.

బలవంతంగా దుకాణాల బంద్

సభా వేదికైన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిసరాల్లోని దుకాణాలు, వర్క్‌షాపులు, తోపుడు బండ్లను పోలీసులు బలవంతంగా మూయించారు. 'దుకాణం మూయకపోతే జరిమానా విధిస్తాం' అంటూ చేసిన హెచ్చరికలతో వ్యాపారులు భయభ్రాంతులకు గురై తాళాలు వేశారు. 'పని పూర్తి చేసి డెలివరీ ఇవ్వాల్సినవి ఉన్నాయి సార్, ఒక్క గంట సమయం ఇవ్వండి' అని వేడుకున్నా అధికారులు కనికరించలేదని, 'ఒక్క రోజుకు ఏమీ కాదులే'అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని దుకాణదారులు వాపోయారు. ఈ ఆకస్మిక బంద్ వల్ల రోజువారీ కూలీల పరిస్థితి దారుణంగా మారింది. 'పని ఉందని ఉదయాన్నే వస్తే, మమ్మల్ని పనిలేకుండా చేశారు. రోజు కూలి చేసుకుంటేనే మా కుటుంబాలు గడిచేది. ఈ రోజు మా పరిస్థితి ఏంటి?' అంటూ పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పేర్లు చెబితే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో వ్యాపారం చేసుకోనివ్వరేమోనన్న భయంతో వారు వివరాలు చెప్పడానికి కూడా నిరాకరించారు. పవన్ రాక తమ లాంటి పేదలకు పస్తులుండేలా చేసిందని వారు ఆవేదన చెందారు.

మీడియాపైనా ఆంక్షలు

సభను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధుల పట్ల జనసేన నాయకులు, కార్యకర్తల తీరు వివాదాస్పదమైంది. కొందరు జనసేన నాయకులు సీనియర్ పాత్రికేయులను సైతం అడ్డుకుని, 'మీకు పాసులు ఎవరు ఇచ్చారు? మీకు డీపీఆర్వో అక్రిడిటేషన్ ఉందా?'అంటూ అధికార దర్పం ప్రదర్శించారు. పార్టీ కార్యక్రమానికి, ప్రభుత్వ గుర్తింపు కార్డుకు సంబంధం ఏమిటని ప్రశ్నించినా వినిపించుకోకుండా నానా హంగామా సృష్టించారు. మరోవైపు అసలైన మీడియా ప్రతినిధులను కాదని.. జనసేన కార్యకర్తలు మీడియా పాసులు ధరించి స్వేచ్ఛగా తిరగడం గందరగోళానికి దారితీసింది. ఈ పరిణామాలపై మీడియా వర్గాల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమైంది. మొత్తం మీద ఒక రాజకీయ సభ కోసం సామాన్య ప్రజలను, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం, పోలీసుల సహాయంతో వారి జీవనోపాధిని దెబ్బతీయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

రేపటి నుంచి నేవీ మారథాన్‌కు రిజిస్ట్రేషన్లు



మారథాన్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, అతిథులు

విశాఖస్పోర్ట్స్: సాగర తీరం వెంట 10వ వైజాగ్ నేవీ మారథాన్ డిసెంబర్ 14న నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మారథాన్‌లో భాగంగా 42కే, 21కే, 10కే, 5కే పరుగులను నిర్వహించనున్నారు. శనివారం ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, కమోడోర్ అనిరుధ్ రాయ్, కెప్టెన్ టి.ఆర్.ఎస్.రాయ్, రాహుల్ సంక్రియా మారథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఉత్సాహంగా సాగే ఈ పరుగులో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎక్కువ మందిని ప్రోత్సహించేందుకు నేవీ ప్రత్యేక డిస్కౌంట్‌తో ప్రవేశ రుసుం కల్పించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఐఎన్ఎస్ కళింగ సీవో అనిరుధ్ మాట్లాడుతూ మారథాన్‌లో ఏటా పాల్గొనే ఔత్సాహికుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఇందులో పాల్గొనే ప్రతి రన్నర్‌కు కిట్, స్నాక్స్, మెడల్ అందజేస్తామన్నారు. రిజిస్ట్రేషన్లు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్నవారు వైజాగ్ నేవీ మారథాన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. అన్ని పరుగులూ ఆర్.కె.బీచ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ప్రారంభమవుతాయని, ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. 10కే రన్‌కు 16 ఏళ్లు నిండిన వారు, 21కే, 42కే పరుగుకు కనీసం 18 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ మాట్లాడుతూ వైజాగ్ నేవీ మారథాన్‌కు మరోసారి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

సీఫుడ్ ఎగుమతిదారుల సమస్యలు పరిష్కరిస్తాం

కేంద్ర కార్యదర్శి అవినాష్ జోషి



సమీక్షిస్తున్న కేంద్ర కార్యదర్శి అవినాష్ జోషి, చిత్రంలో కమిషనర్ రామ్ శంకర్, జేసీ అశోక్

మహారాణిపేట: సీఫుడ్ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి అవినాష్ జోషి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సీఫుడ్ ఎగుమతిదారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎగుమతిదారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, అలాగే ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ సీఫుడ్ వినియోగాన్ని మరింత పెంచడానికి అందరూ కృషి చేయాలని కోరారు. సమీక్షలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్, జేసీ మయూర్ అశోక్, మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు, సీఫుడ్ సంస్థల ప్రతినిధులు పవన్ కుమార్, జి.ఎస్.రావు, డిప్యూటీ డైరెక్టర్ అన్సార్ ఆలీ, ఎంపెడకు చెందిన విజయ్ కుమార్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన



అభ్యర్థుల సర్టిఫికెట్ల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ–2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. జిల్లాలో 1,426 పోస్టులకు సంబంధించి ఓపెన్ కేటగిరీతో పాటు రిజర్వేషన్ కేటగిరీల మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ పరిశీలన ఈ నెల 28న విశాఖ ఉక్కునగరం విమల విద్యా పరిషత్‌లో ప్రారంభమైంది. మొదటి రెండు రోజుల్లో 1,426 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ రెండు రోజుల్లో హాజరు కాలేకపోయిన వారికి, అలాగే హాజరైనప్పటికీ ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా లేని, చిరునామాలు, పేర్లు తారుమారు అయిన 26 మంది అభ్యర్థులకు శనివారం మరో అవకాశం కల్పించినట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. వీరంతా సరైన ధ్రువీకరణ పత్రాలతో రావడంతో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ అభ్యర్థుల్లో కొందరు రెండు నుంచి నాలుగు పోస్టులకు ఎంపికయ్యే ర్యాంకులు సాధించారని, వారు ఏ పోస్టులకు సానుకూలత చూపుతారో దానిని బట్టి రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఉండే అవకాశం ఉందన్నారు.

హార్బర్ ఆధునికీకరణ పనుల పరిశీలన



మాట్లాడుతున్న మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.178 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను శనివారం రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ పరిశీలించి, వేగవంతం చేయాలని సూచించారు. కొత్తగా నిర్మిస్తున్న ఫిషింగ్ జెట్టీలు, వేలం కేంద్రాలు, పార్కింగ్ బిల్డింగ్, నెట్ మెండింగ్ హాల్స్, స్టోరేజ్ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మత్స్యకారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ పి.లక్ష్మణరావు, ఎఫ్‌డీవోలు ఆశాజ్యోతి, మురళి, పోర్ట్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, బోట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, వివిధ సంఘాల నాయకులు సిహెచ్.వీర్రాజు, పి.సి.అప్పారావు, బి.కొండబాబు, ఎం.బాలాజి, ట్రేడర్స్ ప్రతినిధులు, బోటు ఆపరేటర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నిరాశ

ఉక్కునగరం: నెలాఖరున జీతాలు చెల్లించకపోవడంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు నిరాశ చెందారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాల కష్టాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి 50 శాతం, 35 శాతం, 75 శాతం ఇలా ఒక్కో నెల ఒక్కో విధంగా జీతాలు చెల్లించడం ప్రారంభించారు. గత నెలాఖరు వరకు ఉద్యోగులకు 330 శాతం పెండింగ్‌లో పెట్టారు. గత మూడు నెలలుగా నెలాఖరుకు 75 శాతం చెల్లించడం ప్రారంభించారు. అదే విధంగా ఈనెల కూడా శనివారం బ్యాంకులకు చివరి వర్కింగ్ కావడంతో జీతాలు చెల్లిస్తారని ఎదురు చూశారు. సాయంత్రానికి కూడా జీతం చెల్లించక పోవడంతో ఉద్యోగులు అసంతృప్తి చెందారు.

టూరిజం సీఆర్‌వో కౌంటర్ ప్రారంభం

ఏయూక్యాంపస్: పర్యాటకులకు ఉపయుక్తంగా నిలిచే విధంగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన టూరిజం సీఆర్‌వో కౌంటర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం ప్రారంభించారు. డబుల్ డెక్కర్ బస్సులకు సంబంధించిన టికెట్లను ఇక్కడ నుంచి బుక్ చేసుకోవచ్చన్నారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు ప్రయాణించే ఈ డబుల్ డెక్కర్ బస్సులు పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచుతాయన్నారు. అనంతరం సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు జరగనున్న వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్-2025 బ్రోచర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.

క్రేన్ ఢీకొని వాచ్‌మన్ దుర్మరణం

మధురవాడ: మారికవలస మెట్రో మార్ట్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాడి సుందరరావు(74) మృతి చెందాడు. ఈ ఘటనపై పీఎం పాలెం ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అందించిన వివరాలివి.. జాతీయ రహదారి-16పై ఉదయం 7.30 గంటల సమయంలో సుందరరావు రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో మధురవాడ నుంచి మారికవలస వైపు వెళ్తున్న ఒక క్రేన్ వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుందరరావు అక్కడికక్కడే మరణించాడు. జీవీఎంసీ 7వ వార్డులోని వాంబేకాలనీ సమీపంలో ఉన్న చాకలి గెడ్డ టిడ్కో హౌసింగ్ కాలనీలో అతను తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. మెట్రో వెనుక ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న సుందరరావు.. ఓ వ్యక్తి ఫోన్ చేయడంతో అతడిని కలవడానికి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడి కుమారుడు శాంతిరామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ రేపు రాక

మహారాణిపేట: రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సెప్టెంబర్ 1వ తేదీన విశాఖ వస్తున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కేజీహెచ్‌లో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అనకాపల్లిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు మాడుగులలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం విజయవాడ బయలు దేరుతారు.





బై బై గణేశా..

మహారాణిపేట: విశాఖ సాగర తీరంలో గణనాథుడి నిమజ్జనం సందడి మొదలైంది. బొజ్జ గణపయ్యను పూజించిన భక్తులు నిమజ్జనం చేస్తున్నారు. ఇళ్లలో, పందిళ్లలో ఉన్న గణపతిని భక్తితో మేళాలు, డీజేలు, డప్పులు శబ్దాలతో ఊరేగించి మరీ సాగర తీరానికి పట్టుకొస్తున్నారు. భక్తితో పూజించిన గణపతిని అంతే భక్తిగా సాగరంలో నిమజ్జనం చేస్తున్నారు. విశాఖలో ఇటు పెదగంట్యాడ నుంచీ అటూ భీమిలి వరకూ నిమజ్జనం సందడి కనిపించింది.






ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఏడుగురు పోలీస్ సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్‌ఐలు డి.రాము, ఎం.అన్వరాల్‌హక్, ఏఎస్‌ఐలు పి.ఆదినారాయణ, జి.అప్పలరాజు, పి.బాబూరావు, డి.అరుణకుమారి, ఏఆర్‌హెచ్‌సీ ఎ.లోకేశ్వరరావులు ఉద్యోగ విరమణ పొందారు. వీరికి శనివారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ అధికారుల సమక్షంలో సీపీ శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. వీరి కుటుంబ సభ్యులతో కొంత సేపు ముచ్చటించారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లు సుదీర్ఘ సర్వీసు అందించడం గొప్ప విషయమన్నారు.

డూప్లికేట్ తాళాలతో ఏటీఎంల్లో చోరీ

ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్, రిమాండ్



ఏటీఎంల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులతో సీఐ మల్లికార్జునరావు

పరవాడ: దేశపాత్రునిపాలెం, పరవాడ ప్రాంతాల్లోని ఏటీఎం చోరీలకు పాల్పడిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివసింగ్, ప్రదీప్‌సింగ్ చౌహాన్‌లను అరెస్ట్ చేసినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. నిందితులిద్దరు ఎస్‌బీఐకి చెందిన పెర్టో కంపెనీ ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని నగదు చోరీలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. సీఐ తెలియజేసిన వివరాలిలా.. ఈ నెల 27న నిందితులు పరవాడ అయ్యబాబు కాంప్లెక్స్, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఏటీఎంల్లో చోరీలకు పాల్పడి నగదు అపహరించారు. డూప్లికేట్ తాళాలతో ఏటీఎం సేఫ్ డోర్‌ను తెరచి డిస్పెన్సర్ డోర్ వద్ద స్టిక్కర్‌ను డబుల్ టేప్‌తో అతికిస్తారు. దీంతో కస్టమర్లు విత్‌డ్రా చేసిన నగదు బయటకు రాకుండా అందులోనే నిలిచిపోతుంది. కస్టమర్ లావాదేవీలు జరిపి నగదు రాలేదని భావించి వెళ్లిపోయిన తరువాత నిందితులు ఏటీఎంలోకి ప్రవేశించి అతికించిన టేపును తొలగించి డోర్ తెరచి ఇరుక్కొని ఉన్న నగదును తీసుకొని తిరిగి మళ్లీ అదే డోర్‌కు టేపు అంటిస్తారు. ఈ విధానం ద్వారా వారు చోరీలకు పాల్పడుతున్నారు. దీన్ని అనుసరించి పరవాడ అయ్యబాబు కాంప్లెక్స్ ఏటీఎంలో రూ.10 వేలు, దేశపాత్రునిపాలెం ఏటీఎంలో రూ.4,200 నగదును అపహరించారు. ఈ చోరీలపై హిటాచి కంపెనీ చానల్ ఎగ్జిక్యూటివ్ కంఠంరెడ్డి సోమునాయుడు ఈ నెల 28న పరవాడ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. సీసీ టీవీ ఫుటేజ్‌లు, బ్యాంకు లావాదేవీల ఆధారంగా పరవాడ సబ్‌స్టేషన్ వద్ద శనివారం తనిఖీలు జరుపుతుండగా.. నిందితులను గుర్తించామని చెప్పారు. వారి నుంచి రూ.8,800 నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని అనకాపల్లి 11వ అడిషనల్ మున్సిపల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా.. 14 రోజుల రిమాండ్ విధించడంతో అనకాపల్లి సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ చెప్పారు. కేసును ఛేదించిన పరవాడ పోలీసులను అనకాపల్లి డీఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

జీవీఎంసీలో 18 మంది ఉద్యోగుల పదవీ విరమణ



ఉద్యోగులను సన్మానిస్తున్న ఏడీసీ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన 18 మంది ఉద్యోగులు, కార్మికులు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో ఉద్యోగులను జీవీఎంసీ డీపీవో ఎల్.సురేష్‌తో కలిసి అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి సన్మానించారు. రిటైరైన ఉద్యోగుల శేష జీవితం ఆనందదాయకంగా సాగాలని రమణమూర్తి ఆకాంక్షించారు. ప్రతి ఉద్యోగి కుటుంబం కంటే అధిక కాలం సంస్థ కోసం పనిచేస్తారన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో పర్యవేక్షక ఇంజినీర్‌తోపాటు ఎనిమిది మంది పర్మినెంట్ ఉద్యోగులు, 9 మంది పొరుగు సేవల సిబ్బంది ఉన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జెమ్స్ యూనియన్ నాయకులు, పలువురు ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తరాల మధ్య సమరం

నాలుగేళ్ల బాలుడు, 84 ఏళ్ల వృద్ధుడి మధ్య చెస్ పోరు



టోర్నీలో అతిపిన్నవయస్కుడైన షాన్విక్‌తో పోటీ పడుతున్న గోపాలకృష్ణ

విశాఖ స్పోర్ట్స్: క్రీడా వేదికపై ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఒకవైపు చదరంగం బోర్డుపై ఎత్తులకు పైఎత్తులు వేస్తున్న నాలుగేళ్ల చిచ్చరపిడుగు.. మరోవైపు ఎనభై నాలుగేళ్ల అనుభవజ్ఞుడు. తరాల అంతరం ఉన్నా.. వారిద్దరి లక్ష్యం ఒకటే.. ప్రత్యర్థి రాజును కట్టడి చేయడం. విశాఖ వేదికగా శనివారం ప్రారంభమైన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో వీరిద్దరి ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణంగా ఏ క్రీడలోనైనా సబ్-జూనియర్, సీనియర్, వెటరన్ వంటి వయో విభజనలు ఉంటాయి. ఎవరి కేటగిరీలో వారే పోటీపడతారు. కానీ, చదరంగం ఆటలో వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే. అందుకే 4.3 ఏళ్ల జీఆర్ షాన్విక్, 84 ఏళ్ల సీహెచ్ గోపాలకృష్ణ ఒకే టోర్నీలో ప్రత్యర్థులుగా తలపడగలిగారు. క్లాసికల్ చెస్‌లో ఆటగాళ్లు ఆలోచించుకోవడానికి చాలా సమయం ఉంటుంది. కానీ ర్యాపిడ్ చెస్‌లో వేగమే ప్రధానం. పరిమిత సమయంలో మెరుపువేగంతో ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేయాలి. ఇలాంటి ఫార్మాట్‌లో అంతర్జాతీయ స్థాయిలో పోటీలు జరగడం విశేషం. ఇటీవల ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ టైటిల్ కోసం ఇద్దరు భారత క్రీడాకారిణులే తలపడటం, ఈ ప్రాచీన భారతీయ క్రీడలో మన ప్రావీణ్యానికి నిలువుటద్దం పడుతోంది. కాగా.. గోపాలకృష్ణ 7 రౌండ్లలో 4.5, షాన్విక్ 3.5 పాయింట్లు సాధించారు.

అగమ్యగోచరంగా విద్యా రంగం



13వ వార్డులో మహిళకు కరపత్రం అందజేస్తున్న కె.కె.రాజు, కదిరి బాబూరావు

ఆరిలోవ: రాష్ట్రంలో విద్యా రంగం అగమ్యగోచరంగా మారిందని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి బాబూరావు, జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. 13వ వార్డు ఆరిలోవ శివాజీనగర్, 40 గజాల కాలనీల్లో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, స్థానిక నాయకులతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలు, వైఫల్యాల గురించి వివరించి, వాటిపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు, బాబూరావులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో విద్యార్థులకు మేలు జరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం విద్యా రంగానికి గ్రహణం పట్టించిందన్నారు. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్‌లను రద్దు చేసి పేదలపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కె.ఆర్.పాత్రుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కె.శిరీష, స్థానిక నాయకులు వానపల్లి ఈశ్వరరావు, పోలరావు, దుర్గారావు, వాసు, నారాయణరావు, మధుసూదనరెడ్డి, వనం వరలక్ష్మి, పాల్గొన్నారు.

బీసీ మహిళలకు సబ్ కోటా కోసం దీక్ష



నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి, బీసీ మహిళలకు సబ్-కోటా కేటాయించిన తర్వాతే దానిని అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం ఒక్క రోజు నిరాహార దీక్ష నిర్వహించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ అనాదిగా ఓబీసీలు భారతీయ మనువాద సమాజంలో సామాజిక అణచివేతకు, ఆర్థిక దోపిడీకి గురై అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఉత్పత్తి కులాలుగా, శ్రామిక వర్గంగా ఉన్న ఓబీసీలు దేశాభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. అన్ని విధాలా అభివృద్ధి చెందిన ఓసీ మహిళలతో బీసీ మహిళలు పోటీపడి చట్టసభల్లో అడుగుపెట్టడం అసాధ్యమని, అందుకే 33 శాతం మహిళా రిజర్వేషన్లతో కూడిన చట్టానికి సవరణ చేసి, బీసీ మహిళలకు తప్పనిసరిగా సబ్-కోటా కేటాయించిన తర్వాతే దానిని అమలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆధిపత్య వర్గాల మహిళలతో పోలిస్తే, ఓబీసీ మహిళలు చాలా వెనుకబడి ఉన్నారన్నారు. జయశ్రీ మాట్లాడుతూ 30 ఏళ్లుగా కేంద్రంలో ప్రభుత్వాలు మారినా.. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాస్, ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాస్ నాయుడు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా రమణ యాదవ్, నగర అధ్యక్షుడు బోసు, రాష్ట్ర కార్యదర్శి బుద్దా చంద్రవాణి, రాష్ట్ర అధికార ప్రతినిధి పేడాడ సూర్యకుమారి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిడే చెస్ టోర్నీలో నైనా ఆధిక్యం



పోటీలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆంధ్ర చెస్ అసోసియేషన్ పర్యవేక్షణలో వాల్తేరు క్లబ్‌లో శనివారం అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ర్యాపిడ్ విభాగంలో ఏడు పాయింట్లతో నైనా ఆధిక్యంలో ఉండగా, రవి, ఆదిత్య ఆరేసి పాయింట్లతో పోటీలో ఉన్నారు. ర్యాపిడ్ ఏడో రౌండ్‌లో ఎఫ్‌ఎం(ఫిడే మాస్టర్) నైనాతో ఆరు పాయింట్లతో ఉన్న సాత్విక్ తలపడగా, నైనా విజయం సాధించి ఏడు పాయింట్లతో ఆధిక్యానికి దూసుకెళ్లింది. మరోవైపు రామ్‌చరణ్‌పై ఆదిత్య, ఐదున్నర పాయింట్లతో ఉన్న విజయ్‌పై రవి గెలిచాడు. ఆరో రౌండ్‌లో ఎఫ్‌ఎం ఆదిత్య, ఐఎం(ఇంటర్నేషనల్ మాస్టర్) రవికృష్ణల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. శ్రావ్యశ్రీపై సాత్విక్ గెలవగా, విజయ్ కుమార్, రామ్‌చరణ్‌లు డ్రా చేసుకున్నారు. మహిళా ఫిడే మాస్టర్ సుప్రీతపై ఎఫ్‌ఎం నైనా విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో ర్యాపిడ్ చెస్‌లో భాగంగా తొమ్మిది రౌండ్లకు పదిహేను నిమిషాల టైమ్ కంట్రోల్‌తో తొలిరోజు ఆరు రౌండ్లు నిర్వహించారు. ఇందులో 332 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. వీరిలో 131 మంది ఫిడే రేటింగ్ ఆటగాళ్లు ఉన్నారు. ఎఫ్‌ఎం ఆదిత్య వరుణ్ (2183 ఫిడే రేటింగ్), మహిళా ఎఫ్‌ఎం సుప్రీత (1831 ఫిడే రేటింగ్) పోటీకి సిద్ధపడ్డారు. ర్యాపిడ్ విభాగంలో తొలి 30 స్థానాల్లో నిలిచిన వారికి లక్షన్నర రూపాయల నగదు బహుమతులు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తామని ఆంధ్ర చెస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కె.వి.వి.శర్మ తెలిపారు. బ్లిట్జ్ విభాగంలో తొలి 20 స్థానాల్లో నిలిచిన వారికి యాభై వేల రూపాయలు ఇస్తామన్నారు. ఆదివారం బ్లిట్జ్ విభాగంలో మూడు నిమిషాల వ్యవధితో తొమ్మిది రౌండ్లు నిర్వహిస్తామని ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. మణికంఠ రావు చెప్పారు. టోర్నీ ప్రారంభోత్సవంలో నగర పోలీస్ కమిషనర్ బాగ్చి, ఎస్‌ఎన్‌ఎల్ వర్సిటీ వైస్ చాన్సలర్ సూర్యప్రకాశరావు, ఆర్వీ గ్రూప్ చైర్మన్ ఆర్. వెంకటేశ్వరరావు, వాల్తేరు క్లబ్ అధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి బాల సతీష్, కంకటాల మల్లికార్జునరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, మహిళా ఫిడే మాస్టర్ ఆలనామీనాక్షి పాల్గొన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి సుయాష్ చవాన్ విదేశీ సమాఖ్యల నుంచి వచ్చిన ఆటగాళ్లతో పరిచయం చేసుకున్నారు.

టై బ్రేకర్‌లో ముంబాదే గెలుపు



హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత సీజన్ ప్రో కబడ్డీ లీగ్‌లో వరుసగా రెండో రోజూ టైబ్రేకర్‌తోనే విజయం ఖరారైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా టాస్ గెలిచి కోర్టు ఎంచుకోవడంతో తొలి రైడ్‌ను గుజరాత్ జెయింట్స్ తీసుకుంది. తొలి అర్ధభాగంలోనూ హోరాహోరీగా తలపడిన ఇరు జట్లు చివరికి 29 పాయింట్లతో సమంగా మ్యాచ్‌ను ముగించాయి. డూ ఆర్ డై రైడ్‌లోనూ ఆధిక్యం దోబూచులాడింది. ఫైవ్ రైడ్స్‌లో 5-4తో వెనుకబడిన గుజరాత్‌ను ఓడించడానికి ఇరు జట్ల కెప్టెన్లు టాకిల్స్‌కు దిగారు. అనూహ్యంగా గుజరాత్ కెప్టెన్‌ను సునీల్ టాకిల్ చేయడంతో యు ముంబా 6-5తో విజయం సాధించింది. ఆదివారం తమిళ్ తలైవాస్‌తో యు ముంబా ఢీకొట్టనుంది.